# మలి వలపు



*భిక్షాచరో అనుపశ్యతి*
*నాభితటంసాపి తస్య ముఖచంద్రం*
*తచ్చటుకంచ కరంకం*
*ద్వావాపి కాకా విలుంపతి*

**భావం:** భిక్షువు ఆమె నాభినీ, ఆమె చందమామ వంటి అతని ముఖాన్నీ చూస్తూ ఉండగా ఆమె గరిటలోనూ అతని చిప్పలోనూ ఉన్న అన్నాన్ని కాకులు ఏరుకుంటున్నాయి.

మధుకరుడికి నాలుగేళ్ళ వయస్సున్నప్పుడు అతని మేనమామకి కూతురు పుట్టింది. అందరూ మధుకరుడి భార్య పుట్టిందన్నారు. చిన్నారికి

మంజరి అని నామకరణం చేశారు. బొద్దుగా, ముద్దుగా ఉన్న మరదల్ని మధుకరుడు ఎత్తుకుంటే " పెళ్ళాన్ని ఎత్తుకున్నాడు" అని ముసలమ్మలు మేలమాడేరు. మంజరీ మధుకరుల మనస్సులో తాము భార్యాభర్తలమన్న ఊహ బలంగా ఏర్పడింది. ప్రేమబీజాలు అంకురించి, పెరిగి, పెద్దవై పెద్ద వృక్షాలయ్యాయి.

కానీ ఈలోగా పెద్దవాళ్ళమధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. మేనమామ ఆగ్రహించి మంజరికి ఇంకొకరితో వివాహం జరిపించేశాడు. మధుకరుడికి నిరాశా, నిస్పృహా, ఉక్రోషమూ కలిగాయి. అందరి మీదా అలిగి అతడు సన్యాసులలో కలిసిపోయాడు.

మఠంలో పూజలూ, దైవ సంబంధమైన ఉపన్యాసాలూ, నేలమీద నిద్రా, కాషాయాంబరాలూ, భిక్షాటన ద్వారా లభించిన భోజనమూ, మధుకరుడికి రోజులు భారంగా గడుస్తున్నాయి. నిజమైన వైరాగ్యంతో సన్యసించిన వాడు కాదు కదా. ఒక్కొక్కసారి ఇంటికి వెళ్ళిపోవాలనిపించేది. ఇంట్లోని పంచభక్ష్య పరమాన్నాలతో భోజనమూ, పట్టుపరుపులపై నిద్రా, చందనాది తైలాలతో స్నానమూ గుర్తొచ్చేవి. అంతలో తప్పిపోయిన మేనరికం గుర్తొచ్చి పౌరుషమొచ్చేది.

ఒకరోజు మధుకరుడు ఉదయం భిక్షకు బయల్దేరాడు. ప్రతి యింటిముందూ నిల్చుని యాచిస్తూ ఉంటే ఇంట్లో స్త్రీలు గరిటెతోనో గిన్నెతోనో అన్నం తెచ్చి అతని చిప్పలో వేస్తున్నారు. ఒక ఇంటి ముందు నిల్చుని 'భిక్షాందేహి' అన్నాడు. ఇంటి ఇల్లాలు పనిలో ఉందేమో యజమాని కూతురు గరిటెతో అన్నం తెచ్చింది.

మధుకరుడామెను చూశాడు. నల్లని జుట్టూ, ఫాలాన్నికప్పే ముంగురులూ, అందమైన కళ్ళూ సంపెంగ ముక్కూ అనుకుంటూ చూస్తున్న అతనికి సన్యాసి పరస్త్రీని చూడరాదని గుర్తుకు వచ్చింది. అతని చూపులు నాభి వద్ద ఆగిపోయాయి.

ఆ అమ్మాయి కూడా అతనికేసి చూసింది. బోడిగుండూ, కాషాయాంబరాలతోటే ఇంత అందంగా ఉన్నాడు. మామూలుగా ఇంకెంత బాగుంటాడో అనుకుంటూ అతని చందమామ లాంటి ముఖాన్ని చూడసాగింది.

ఇద్దరికీ స్పృహలేదు. అతని చిప్పలోనివీ, ఆమె గరిటెలోనివీ అన్నం మెతుకుల్ని కాకులు ఏరుకోసాగాయి.

స్పృహలోకి వచ్చిన మధుకరుడికి ఈమె ముందు మేనమామ కూతురు ఏ మూలకి అన్పించింది. దండమూ, కమండలమూ విసిరేశాడు. పెద్దల ఆశీర్వాదంతో ఆమెను వివాహం చేసుకున్నాడు.

ఒకసారి ప్రేమ విఫలమైతే జీవితం లేదనుకునే యువతరానికి ఈ కథ వెలుగు చూపాలి. పసి హృదయాలలో అనవసరంగా ఆలోచనలు రేకెత్తించరాదనే హెచ్చరికను పెద్దలు చూడాలి.

******